సాక్షి
నిజామాబాద్
గురువారం । 21 । నవంబర్ । 2024



కమీషన్ కష్టాలు
ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు కమీషన్ సకాలంలో అందించకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు.
- 8లో ▸



బాలల హక్కుల రక్షణకు..
బాలల హక్కుల పరిరక్షణకు అందరూ పాటుపడాలని జిల్లా జడ్జి సునీత కుంచాల పేర్కొన్నారు.
- 8లో ▸

గరిష్టం/కనిష్టం
33.3 /12.0

వాతావరణం
ఉదయం చలిగా ఉంటుంది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. రాత్రి మంచు కురుస్తుంది. చలి తీవ్రత కొనసాగే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

తెరుచుకున్న డాక్యుమెంట్ రైటర్ల దుకాణాలు



సుభాష్‌నగర్ : నిజామాబాద్ అర్బన్ రిజిస్ట్రేషన్ కార్యాలయ దస్తావేజు లేఖర్ల దుకాణాలు బుధవారం తెరుచుకున్నాయి. సబ్ రిజిస్ట్రార్ ఇబ్బంది పెడుతున్నారంటూ 9 రోజులుగా దుకాణాలు మూసి ఉంచారు. దీంతో రిజిస్ట్రేషన్లు మందకొడిగా సాగాయి. అయితే సబ్ రిజిస్ట్రార్ నాలుగు రోజులు సెలవులో వెళ్లారు. ఇన్‌చార్జిగా చంద్రశేఖర్ బుధవారం బాధ్యతలు తీసుకున్నారు. దస్తావేజు లేఖర్లు పెండింగ్‌లో ఉన్న డాక్యుమెంట్లకు రిజిస్ట్రేషన్ చేయించారు. బుధవారం ఒక్కరోజే 40 వరకు సేల్ డీడ్, గిఫ్ట్ డీడ్, మార్ట్‌గేజ్, తదితర డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్ చేసినట్లు తెలిసింది. చాలా రోజుల తర్వాత రిజిస్ట్రేషన్ కార్యాలయం ప్రజలు, డాక్యుమెంట్ రైటర్లతో సందడిగా మారింది.

నేడు పోలీస్ పాసింగ్ అవుట్ ప్రోగ్రామ్

ఖలీల్‌వాడి : ఎడపల్లి మండలం జాన్కంపేట్ వద్ద గల సీటీసీ కేంద్రంలో శిక్షణ పూర్తి చేసుకున్న కానిస్టేబుళ్ల పాసింగ్ అవుట్ ప్రోగ్రామ్ గురువారం నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జి సీపీ సింధుశర్మ తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డైరెక్టర్ జనరల్ అనిల్ కుమార్ వస్తున్నట్లు పేర్కొన్నారు.

టీఎన్జీవోస్ కార్యాలయంలో గ్రీవెన్స్ సెల్




ఆర్మూర్ : జిల్లా కేంద్రంలోని టీఎన్‌జీవోస్ కార్యాలయంలో ఉద్యోగుల సమస్యలపై చర్చించి పరిష్కరించేందుకు గ్రీవెన్స్ సెల్‌ను ఏర్పాటు చేసినట్లు జిల్లా అధ్యక్షుడు నాశెట్టి సుమన్ తెలిపారు. ఆర్మూర్ టీఎన్‌జీవోస్ భవన్‌లో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. గ్రీవెన్స్ సెల్‌లో తెలియజేసిన సమస్యలను రెండు, మూడు రోజుల్లో పరిష్కరించడానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం టీఎన్జీవో నూతన జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా ఎన్నికైన సుమన్, శేఖర్‌ను ఆర్మూర్ యూనిట్ తరఫున సన్మానించారు. పోల శ్రీనివాస్, దినేష్ బాబు, వేణుగోపాల్, గంగకిషన్, జాఫర్ హుస్సేన్, అతిక్ హుస్సేన్, ఆకుల ప్రసాద్, వనమాల సుధాకర్, శికారి రాజు, గోవర్ధన స్వామి పాల్గొన్నారు.

గన్నీ బ్యాగుల కొరత లేకుండా చూడాలి



జక్రాన్‌పల్లి : ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో గన్నీ బ్యాగుల కొరత లేకుండా చూడాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు ఆదేశించారు. జక్రాన్‌పల్లి మండలం పడకల్‌లో కొనుగోలు కేంద్రాన్ని బుధవారం ఆయన పరిశీలించారు. సన్నరకం ధాన్యానికి ప్రభుత్వం రూ.500 బోనస్ జమ చేస్తున్నట్లు పేర్కొన్నారు. రైతుల ఖాతాల్లో డబ్బులు వేగంగా పడేలా చూడాలని సూచించారు. కేంద్రంలో తూకం వేసిన ధాన్యం వివరాలు ఆరా తీశారు. కేంద్రం నుంచి ధాన్యాన్ని వెంటవెంటనే మిల్లులకు తరలించాలని సూచించారు. కొనుగోలు ప్రక్రియను మరింత వేగవంతం చేయాలన్నారు. ఏవో దేవిక, ఏఈవో సుభాష్య, అర్గుల్ సొసైటీ కార్యదర్శి తిరుపతిరెడ్డి ఉన్నారు.

కళాయాత్రను విజయవంతం చేయాలి



నిజామాబాద్ అర్బన్ : రాష్ట్రంలో ప్రజాపాలనకు ఏడాది పూర్తయిన సందర్భంగా జిల్లాలో నిర్వహిస్తున్న ప్రజాపాలన కళాయాత్రను విజయవంతం చేయాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు సూచించారు. తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారుల బృందం డిసెంబర్ 7 వరకు జిల్లావ్యాప్తంగా అన్ని పట్టణాలు, మండల కేంద్రాలు, మేజర్ పంచాయతీల్లో సాంస్కృతిక ప్రదర్శనలు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. కళాయాత్ర ప్రదర్శనల వాహనాన్ని కలెక్టర్ బుధవారం జెండా ఊపి ప్రారంభించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుపై ప్రచారం చేయనున్నారు. డీపీఆర్వో ఎన్ పద్మశ్రీ, కళాకారులు పాల్గొన్నారు.

● కబ్జాల కథ..

శాంతి భద్రతల సమస్య

నగరంలో భూ కబ్జాలు శాంతి భద్రతల సమస్యకు దారితీస్తున్నాయి. వివిధ పార్టీలకు చెందిన కొందరు రాజకీయ నాయకులు రెండో అవతారంగా భూ ఆక్రమణలకు పాల్పడుతున్నారు. కిరాయి మూకలను ఏర్పాటు చేసుకోవడంతో ఒక్కోసారి గ్యాంగ్ వార్‌లకు దారి తీస్తోంది. చెరువులు, కెనాల్స్, పార్కులు, ప్రభుత్వ భూములే కాదు పేద వర్గాలకు చెందిన ప్లాట్‌లను కబ్జాలు చేసి రూ. లక్షల్లో డిమాండ్ చేస్తున్నారు.



నగరంలో గ్యాంగ్‌వార్‌లు
- మేయర్ భర్తపై దాడితో మరింత రచ్చ
- ఇప్పటికే చెరువులు, పులాంగ్ వాగు, కెనాల్స్ ఆక్రమణ
- పార్కులు, ప్రభుత్వ భూములు, పేదల ప్లాట్‌లనూ వదలని వైనం
- కిరాయి మూకలను ఏర్పాటు చేసుకుని బెదిరింపులు.. రూ. లక్షల్లో వసూళ్లు
- కొందరు రాజకీయ నాయకుల దో నంబర్ దందా

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : నిజామాబాద్ నగరంలో శాంతి భద్రతలు గాడితప్పే విషయంలో అనేక కారణాలు ఉన్నప్పటికీ భూముల వ్యవహారాలు అత్యధికంగా ఉంటున్నాయి. భూముల ఆక్రమణలు, దౌర్జన్యంగా కబ్జా చేసే విషయంలో కాంగ్రెస్, బీఆర్‌ఎస్, ఎంఐఎం నాయకుల సంఖ్య ఎక్కువ కావడంతో చివరకు గ్యాంగ్‌వార్‌కు దారితీస్తున్న పరిస్థితులు తలెత్తాయి. భూములు కబ్జా చేయడమనేది ఒక స్టేటస్‌గా మార్చుకుని సొమ్ము చేసుకుంటున్న కొందరు నాయకులు పదులు, వందల సంఖ్యలో కిరాయి మనుషులను ఏర్పాటు చేసుకుంటున్నారు. ఈ కిరాయి మనుషుల్లో బీహార్, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్‌కు చెందిన వ్యక్తులు ఉన్నారు. ఇలా గ్యాంగ్‌లను ఏర్పాటు చేసుకున్న కొందరు నాయకులు, ప్రజాప్రతినిధులు భూకబ్జాల విషయంలో విచ్చలవిడిగా చెలరేగిపోయారు.

■ నగరంలో గత మూడునాలుగేళ్లుగా భూ కబ్జాల విషయమై అనేక ఘర్షణలు చోటుచేసుకున్నాయి. రెండేళ్ల క్రితం అప్పటి నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యేగా ఉన్న బాజిరెడ్డి గోవర్ధన్ అల్లుడైన పింటూ అనే వ్యక్తిపై దాడి చేసిన ఘటన అప్పట్లో నగరంలో కలకలం రేపింది. ప్రస్తుతం మేయర్ నీతూకిరణ్ భర్త దండు చంద్రశేఖర్ మీద తీవ్రమైన దాడి మరింత సంచలనం సృష్టించింది. భూములు కబ్జాలు చేసిన వ్యక్తులు నిజామాబాద్ నగరంలో చెరువులు, వాగులు, కెనాల్స్, పార్కులు, ప్రభుత్వ భూములు సైతం వదల్లేదు. ఇలా ఆక్రమణలు చేసినవారిలో కార్పొరేటర్ల నుంచి కీలక ప్రజాప్రతినిధుల వరకు ఉంటున్నారు. మరో ముఖ్యమైన విషయమేమిటంటే కబ్జాలు చేసిన, ప్రోత్సహించిన వారిలో కాంగ్రెస్, బీఆర్‌ఎస్, ఎంఐఎం నాయకులు ఉన్నారు. బోధన్ రోడ్డులో, బాన్సువాడ రోడ్డులో స్థలం కనిపిస్తే చాలు కబ్జా చేయడం ప్లాట్లుగా చేసి విక్రయించడం చేస్తూ వచ్చారు. కెనాల్స్ సైతం ఆక్రమించి ప్లాట్లు చేసి విక్రయించడం గమనార్హం. చివరకు పేదల భూములనూ కబ్జాలు చేసి ఆయా ప్లాట్లలో షెడ్లు వేయడం.. సదరు ప్లాట్ల ఓనర్లు తమ ప్లాట్లకే డబ్బులు ఇచ్చేలా బెదిరింపులు చేసేవరకు వెళ్లింది. మరోవైపు ఒకరి ప్లాటును మరొకరికి అమ్మేసి సెటిల్‌మెంట్లు చేసేస్థాయికి, అత్యంత పరాకాష్టకు కబ్జాల పర్వం చేరింది. ఈ క్రమంలో శాంతిభద్రతల సమస్యలు తలెత్తుతున్నాయి.

రామర్తి చెరువు కబ్జా.. ఆపై రాజకీయాలు

నగరంలోని బోధన్ రోడ్డులో ఉన్న 32 ఎకరాల రామర్తి చెరువు కబ్జాల కారణంగా 6 ఎకరాలకు కుంచించుకుపోయింది. ఈ విషయమై గతంలో 'సాక్షి' వరుస కథనాలు ప్రచురించడంతో అధికారులు వరుసగా మూడు రోజుల పాటు కూల్చివేతలు చేశారు. చివరకు ఇక్కడ కూడా అధికార పార్టీ నాయకులు రాజకీయాలు చేసి చెరువు ఆక్రమణదారులకు వత్తాసు పలకడం విశేషం.

■ నగరంలో కీలకమైన పులాంగ్ వాగును సైతం అడుగడుగునా ఆక్రమించారు. ప్రగతినగర్‌లో పలు చోట్ల వాగు ఆక్రమించారు. అదేవిధంగా ఎల్లమ్మగుట్ట వద్ద వరుసగా మూడు చోట్ల లేఅవుట్లు వేసిన వ్యక్తులు వాగును ఆక్రమించి బఫర్‌జోన్‌లో గ్రీన్‌బెల్ట్‌గా చూపడం విశేషం. మరోవైపు కంఠేశ్వర్ బైపాస్ వద్ద పులాంగ్ వాగు మధ్యలో గోడ కట్టి మరీ ప్లాట్లు చేసి అమ్మేశారు. గూపన్‌పల్లిలో సైతం పులాంగ్ వాగును ఆక్రమించి ప్లాట్లు చేశారు. వీటన్నింటిని హైడ్రా మాదిరి వ్యవస్థ ఏర్పాటు చేసి తొలగించాలని డిమాండ్లు వస్తున్నాయి.



నృత్యం చేస్తున్న కళాకారులు

అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యం

- రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి
- ఘనంగా ప్రజాపాలన విజయోత్సవాలు
- అలరించిన కళా ప్రదర్శనలు



మాట్లాడుతున్న రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి

నిజామాబాద్ అర్బన్ : అన్ని వర్గాల ప్రజల అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తున్నట్లు రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డి అన్నారు. ప్రభుత్వానికి ప్రజలు మద్దతుగా నిలుస్తూ ఆశీర్వదించాలని కోరారు. రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఏర్పాటై ఏడాది పూర్తి చేసుకుంటున్న సందర్భంగా జిల్లా కేంద్రంలోని రాజీవ్ గాంధీ ఆడిటోరియంలో బుధవారం సాయంత్రం ప్రజాపాలన విజయోత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన భూపతిరెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వం ఏర్పడిన 48 గంటల్లోనే ఆరు గ్యారంటీలలో రెండు గ్యారంటీలను అమలు చేసిందన్నారు. రైతులకు రూ.31 వేల కోట్ల పంట రుణాలను మాఫీ చేశామన్నారు. ఏడాది కాలంలోనే 50 వేల ఉద్యోగాలను భర్తీ చేసినట్లు తెలిపారు. హాస్టల్ విద్యార్థులకు కాస్మెటిక్స్, మెస్ చార్జీలను రాష్ట్ర ప్రభుత్వం పెంచిందని పేర్కొన్నారు. కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు మాట్లాడుతూ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ద్వారా రూ.125.91 కోట్ల లబ్ధి చేకూర్చిందని, జిల్లాలో ప్రతిరోజు సగటున 93 వేల మంది మహిళలు ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని వినియోగించుకుంటున్నారని తెలిపారు. వివిధ పథకాల లబ్ధి పొందుతున్న వారి వివరాలను కలెక్టర్ వివరించారు. జిల్లాలో సమగ్ర కుటుంబ సర్వే ప్రక్రియ తుది దశకు చేరిందన్నారు. అన్ని వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసేలా జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకుందని తెలిపారు. ఈ నెల 19 నాటికి 84.8శాతం సర్వే పూర్తయిందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్‌రెడ్డి, అదనపు కలెక్టర్ అంకిత్, ట్రెయినీ కలెక్టర్ సంకేత్, నగరపాలక సంస్థ కమిషనర్ దిలీప్, ఆర్డీవో రాజేంద్ర కుమార్, మెప్మా పీడీ రాజేందర్ పాల్గొన్నారు.

పడిపోయిన 'పల్లి' ధర

- 80 కిలోల బస్తా రూ.2,100
- సీజన్ ప్రారంభంలో రూ.మూడు వేలు పలికిన రేటు

బాల్కొండ : పల్లికాయ ధర పడిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పంట చేతికి రావడంతో నెల రోజుల నుంచి పల్లికాయను వెలికి తీస్తున్నారు. సీజన్ ప్రారంభంలో 80కిలోల పల్లి కాయల బస్తా రూ.మూడు వేలు పలికింది. తాజాగా వ్యాపారులు బస్తా ధరను రూ.2,100 కు తగ్గించారు. మెండోరా మండలం బుస్సాపూర్‌లో పల్లికాయను అధికంగా సాగు చేస్తారు. ఖరీఫ్‌లో పచ్చి బుట్ట కోసం మక్క సాగు చేసి, ఆగస్టులో పల్లికాయ వేస్తారు. 90 రోజుల వ్యవధిలో పంటను వెలికి తీసి విక్రయిస్తారు. అయితే మార్కెట్‌లో డిమాండ్ ఉన్నప్పటికీ వ్యాపారులు ధర తగ్గించడంపై రైతులు ఆందోళన చెందుతున్నారు.



బుస్సాపూర్‌లో పల్లికాయ జాలి పడుతున్న రైతులు

ధర బాగా తగ్గించారు
పల్లికాయ ధరను ప్రస్తుతం బాగా తగ్గించారు. ప్రారంభంలో బస్తాకు రూ.3 వేలు చెల్లించిన వ్యాపారులు ప్రస్తుతం రూ.2,100 చెల్లిస్తున్నారు. మార్కెట్ ఎక్కడా అందుబాటులో లేకపోవడంతో ఇక్కడ వ్యాపారులు చెప్పిన ధరకే విక్రయిస్తున్నాం.
– ముత్యంరెడ్డి, రైతు

బుస్సాపూర్‌లో మార్కెట్
బుస్సాపూర్‌లో పల్లికాయ పంటను అధికంగా సాగు చేస్తారు. దీంతో గ్రామంలోనే మార్కెట్ అందుబాటులో ఉంది. దాదాపుగా పల్లి సాగు అన్ని గ్రామాల్లో కనుమరుగు అయింది. మెండోరా మండల కేంద్ర, బుస్సాపూర్‌లో ప్రస్తుతం అధికంగా వేస్తున్నారు. మార్కెట్ గ్రామంలోనే అందుబాటులో ఉండటంతో రైతులకు కలిసి వస్తుంది.

ఏపీ, తమిళనాడుకు ఎగుమతి
బుస్సాపూర్‌లో కొనుగోలు చేసిన పల్లికాయను వ్యాపారులు అధికంగా ఆంధ్రప్రదేశ్, తమిళనాడు రాష్ట్రాలకు ఎగుమతి చేస్తున్నారు. ప్రస్తుతం చేతికందిన పల్లికాయను అక్కడ అధికంగా వినియోగిస్తారని వ్యాపారులు అంటున్నారు. పక్క రాష్ట్రాల్లో డిమాండ్ ఉన్నప్పటికీ వ్యాపారులు ఇక్కడ మాత్రం ధరను తగ్గిస్తున్నారు. వ్యాపారులు మార్కెట్‌లో కిలోకు రూ.80కి విక్రయిస్తున్నారు.

తహసీల్ ఆఫీస్‌లో షాడో అధికారి

- ఏ పని కావాలన్నా ఆయనను కలవాల్సిందే..
- వివాదాస్పదంగా అధికారి బంధువు తీరు
- కార్యాలయంలో కుర్చీ వేసుకొని పనులు



నిజామాబాద్ అర్బన్ : జిల్లా కేంద్రంలోని నార్త్ రెవెన్యూ కార్యాలయంలో ఓ వ్యక్తి షాడో అధికారి అవతారం ఎత్తాడు. ఆఫీస్‌లోని ఓ అధికారి బంధువు అయిన సదరు వ్యక్తి కార్యాలయానికి వచ్చే వారి వద్ద వసూళ్లకు పాల్పడుతున్నాడు. ఏ పని కావాలన్నా ఆయనను కలవాల్సిందే అని విధంగా పరిస్థితి తయారైంది. కార్యాలయంలో ప్రత్యేక కుర్చీ ఏర్పాటు చేసుకొని పనులు చక్కబెడుతున్నాడు. సంబంధిత అధికారి మాత్రం అక్కడ అందుబాటులో ఉండరు. కార్యాలయానికి వచ్చే వారు సదరు అధికారి బంధువును కలిస్తే ఆయన పనులు చేయిస్తాడనే ఆరోపణలు ఉన్నాయి.

సర్టిఫికెట్ల కోసం..
ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ కోసం ఈ కార్యాలయానికి వచ్చే వారు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఈ సర్టిఫికెట్ మంజూరు చేయడంలోనూ సదర్ షాడో అధికారి రూ.10 వేల నుంచి రూ. 20 వేల వరకు వసూలు చేస్తున్నారు. ఇటీవల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఓటర్ నమోదు ప్రక్రియ కొనసాగింది. ఈ వ్యవహారంలో కొందరు అభ్యర్థుల నుంచి నేరుగా దరఖాస్తులు తీసుకున్న వీరు కార్యాలయంలోనే ఓటర్ నమోదు ప్రక్రియను చేపట్టారు. దీనికోసం ఒక్కో అభ్యర్థికి రూ.వెయ్యి చొప్పున వసూలు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. కాగా సదరు అధికారికి కార్యాలయంలో ముగ్గురు ఉద్యోగులు సహకారం అందిస్తున్నట్లు తెలిసింది. వీరి వసూళ్ల పర్వానికి ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్ ప్రధాన కేంద్రంగా మారినట్లు సమాచారం. ఉన్నతాధికారులు విచారణ చేసి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

డబ్బులు ఇస్తేనే పనులు
తహసీల్ కార్యాలయంలోని సదరు షాడో అధికారికి డబ్బు ఇస్తేనే పనులు అవుతాయి. ఇటీవల ఐదుగురు ప్రభుత్వ టీచర్లు నగరంలోని గిరిరాజ్ కళాశాల సమీపంలో భూమి రిజిస్ట్రేషన్ కోసం కార్యాలయానికి వచ్చారు. ఆ స్థలంలో అనేక లోపాలు ఉన్నాయని, వాటిని సవరించి రిజిస్ట్రేషన్ కావాలంటే ముడుపులు ఇవ్వాలని షాడో అధికారి చెప్పాడు. అనంతరం నగరంలోని ఓ హోటల్లో సదరు టీచర్లను కలిసిన షాడో అధికారి వారి నుంచి రూ.2.5 లక్షలు తీసుకొని ఈ వ్యవహారాన్ని చక్కబెట్టారు. అలాగే ఓ వ్యక్తి నాలా అనుమతి కోసం దరఖాస్తు చేసుకోగా ఎకరాకు రూ.12 లక్షల చొప్పున వసూలు చేసినట్లు సమాచారం. కాగా సంబంధిత అధికారి మాత్రం సాయంత్రం వేళ కార్యాలయానికి వచ్చి సంతకాలు చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. కార్యాల పనివేళల్లో అతని బంధువే ఆఫీస్‌లో వ్యవహారాలు చక్కబెడతారని సమాచారం.

మా బంధువు వస్తాడు కానీ..
కార్యాలయానికి అప్పుడప్పుడు మా బంధువు వస్తుంటాడు. కానీ ఎలాంటి అధికారిక పనుల్లో జోక్యం చేసుకోడు. వసూళ్ల పర్వం నిజం కాదు. నిబంధనల ప్రకారమే కార్యాలయ పనులు కొనసాగుతున్నాయి. అవినీతి ఆరోపణలపై విచారణ చేస్తాం.
– నాగర్జున, తహసీల్దార్

రైతులను మోసం చేస్తున్న ప్రభుత్వం

- మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేస్తోందని బాల్కొండ ఎమ్మెల్యే, మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ అన్ని రకాల ధాన్యానికి బోనస్ ఇస్తామని హామీ ఇచ్చిందన్నారు. కానీ ఇప్పుడు సన్న వడ్లకే బోనస్ ఇస్తామనడం రైతులను వంచించడమేనన్నారు. కొనుగోలు కేంద్రాలు ప్రారంభించామని ఆర్భాటంగా చెబుతున్నా.. క్షేత్రస్థాయిలో కొనుగోళ్లు వేగంగా జరగడం లేదన్నారు. రైతులకు బోనస్ ఎగ్గొట్టేందుకే ప్రభుత్వం కొనుగోళ్ల విషయంలో జాప్యం చేస్తోందని ఆరోపించారు. కాంటాలు ఆలస్యంగా అవుతుండటంతో రైతులు తప్పని పరిస్థితుల్లో ప్రైవేటుకు అమ్ముకుంటూ నష్టపోతున్నారన్నారు. ప్రైవేటు వ్యాపారులకు ధాన్యం అమ్ముకున్న రైతులకూ బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ శాఖ వద్ద రైతుల వారీగా సాగు విస్తీర్ణం వివరాలు ఉంటాయని, వాటి మేరకు ఎకరాకు 25 క్వింటాళ్ల చొప్పున బోనస్ అందించాలన్నారు. ప్రస్తుతం కొనుగోలు కేంద్రాల్లో తీసుకుంటున్న దొడ్డు రకం వడ్లకు కూడా బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేకపోతే రైతులతో కలిసి ఆందోళనలు చేస్తామన్నారు.

చెక్ పోస్ట్‌ను కాల్చివేసిన దుండగులు

- పోలీసులకు తహసీల్దార్ ఫిర్యాదు

పోతంగల్ (రుద్రూర్): ఇసుక అక్రమార్కులు రెచ్చిపోతున్నారు. అధికారులు ఏర్పాటు చేసిన చెక్ పోస్టుకు నిప్పుపెట్టారు. ఈ ఘటన నిజామాబాద్ జిల్లా పోతంగల్ మండలం కొడిచర్ల శివారులో చోటు చేసుకుంది. మంజీరా నది పరీవాహక ప్రాంతం నుంచి ఇసుక అక్రమ రవాణాను అరికట్టడానికి కొడిచర్ల గ్రామ శివారులోని మద్నూర్ మండలం సిర్పూర్ వెళ్లే దారిలో అధికారులు చెక్ పోస్టు ఏర్పాటు చేశారు. ఇక్కడ ఉదయం నుంచి సాయంత్రం వరకు రెవెన్యూ, పోలీస్ సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. చెక్ పోస్ట్ ఉండడం వల్ల ఇసుక అక్రమ రవాణాకు ఇబ్బందులు కలుగుతున్నాయని భావించిన అక్రమార్కులు సిబ్బంది లేని సమయంలో నిప్పుపెట్టారు. ఉన్నతాధికారుల ఆదేశాలతో ఏర్పాటు చేసిన చెక్‌పోస్ట్‌కు ఇసుక అక్రమార్కులు నిప్పు పెట్టారంటే, వారు ఎంతకు తెగించారో అర్థమవుతోంది. ఈ ఘటన మండలంలో తీవ్ర కలకలం సృష్టించింది. ఈ విషయమై బుధవారం పోతంగల్ తహసీల్దార్ మల్లయ్య కోటగిరి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు కోటగిరి ఎస్సై సందీప్ తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి కామారెడ్డి జిల్లా డొంగ్లీ మండలం లింబూర్‌కు చెందిన వ్యక్తిని అనుమానిస్తున్నట్టు ఎస్సై తెలిపారు.



కొడిచర్ల శివారులో కాలిపోయిన చెక్‌పోస్ట్

ప్రశాంత్‌రెడ్డీ.. రాజీనామాకు సిద్ధంగా ఉండు!



మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి, పక్కన నుడా చైర్మన్ కేశ వేణు

- హామీలపై చర్చిద్దాం రండి..
- డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి

నిజామాబాద్ సిటీ : 'ప్రశాంత్‌రెడ్డి రాజీనామాకు సిద్ధం ఉండు.. ఎన్నికల్లో ఇచ్చిన హామీలపై చర్చకు మేం సిద్ధం.. స్థలం, తేదీ నువ్వే చెప్పు.. బీఆర్‌ఎస్ పాలనపై కూడా చర్చిద్దాం' అని బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డికి డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్ రెడ్డి సవాల్ విసిరారు. బుధవారం జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ భవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. పదేళ్లలో బీఆర్‌ఎస్ ఇచ్చిన హామీలు ఎంతవరకు అమలయ్యాయో మంత్రిగా ప్రశాంత్‌రెడ్డికి తెలియదా అని ప్రశ్నించారు. మైక్‌లు ముందున్నాయని ఇష్టం వచ్చినట్లు మాట్లాడటం మర్యాదకాదన్నారు. మొన్న భీమ్‌గల్‌లో లింబాద్రి గుట్టపై కూడా రాజకీయాలు చేశారని మండిపడ్డారు. బీఆర్‌ఎస్ పాలనలో ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చనందుకు ముందుగా ఎమ్మెల్యే పదవికి ప్రశాంత్‌రెడ్డి రాజీనామా చేయాలన్నారు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఇంటికో ఉద్యోగం ఇవ్వలేదని, డబుల్ బెడ్ రూమ్‌లు ఇళ్లు, దళితులకు మూడెకరాల భూమి ఇవ్వలేదని గుర్తుచేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన 11 నెలల్లోనే మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ.500కే గ్యాస్ సిలిండర్, రూ.10 లక్షల ఆరోగ్యశ్రీ పెంపు వంటివి చేశామన్నారు.

మేయర్ భర్తపై దాడితో సంబంధం లేదు
నగర మేయర్ దండు నీతు కిరణ్ భర్త శేఖర్‌పై దాడిని కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తుందని నుడా చైర్మన్, కాంగ్రెస్ నగర అధ్యక్షుడు కేశ వేణు పేర్కొన్నారు. దాడితో కాంగ్రెస్ నాయకులకు సంబంధం లేదన్నారు. బీఆర్‌ఎస్ అంతర్గత పోరుతోనే ఈ దాడి జరిగినట్లు బయట ప్రచారం జరుగుతుందన్నారు. దాడి చేసిన వ్యక్తి రసూల్ మేయర్ భర్తతో సరదాగా ఉన్న వీడియోను ఆయన చూపెట్టారు. నగరంలో పేదల భూములు, ఇంటి స్థలాలు పెద్ద సంఖ్యలో కబ్జాకు గురయ్యాయన్నారు. పేదల భూములు కబ్జా చేసిన వారిని పోలీసులకు కఠినంగా శిక్షించాలన్నారు. ఆక్రమణకు గురైన బాధితులకు కాంగ్రెస్ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. దాడి విషయంలో కాంగ్రెస్‌పై బురద చల్లడం తగదన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి, పీసీసీ డెలిగేట్ బాడ్సి శేఖర్‌గౌడ్, కార్పొరేటర్ గడుగు రోహిత్, నాయకులు వేణురాజ్, జావేద్ అక్రం, నరేందర్‌గౌడ్, దయాకర్, రేవతి, శ్రీనివాస్, శివ పాల్గొన్నారు.

క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

నిజామాబాద్‌అర్బన్‌: వచ్చే ఏడాది జనవరిలో నిర్వహించే సర్టిఫికెట్‌ కోర్సు శిక్షణకు అర్హులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి అశోక్‌ బుధవారం ఒక ప్రకటనలో సూచించారు. డ్రాయింగ్‌, టైలరింగ్‌, ఎంబ్రాయిడరీ, లోయర్‌, అయ్యర్‌ గ్రేడ్లలో టెక్నికల్‌ సర్టిఫికెట్‌ కోర్సు పరీక్ష వచ్చే ఏడాది జనవరిలో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఏడవ తరగతి ఉత్తీర్ణులైన వారు లోయర్‌ గ్రేడ్‌ పరీక్షకు హాజరుకావాలని, లోయర్‌ గ్రేడ్‌ పరీక్షకు సమానమైన ఉత్తీర్ణత సాధించిన వారు సంబంధిత ట్రేడ్‌లలో హయ్యర్‌ గ్రేడ్‌ పరీక్షకు హాజరుకావాలని పేర్కొన్నారు. పరీక్షలకు హాజరు కావాలనుకునే అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, దరఖాస్తు ఫారాలను డౌన్‌లోడ్‌ చేసి జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

ఈవోపై పోలీసులకు ఫిర్యాదు



భిక్కనూరు: సమాచార హక్కు చట్టం కింద దరఖాస్తు చేసుకుంటే సమాచారం ఇవ్వలేమని లిఖిత పూర్వకంగా రాసిచ్చిన భిక్కనూరు సిద్ధరామేశ్వరాలయం ఈవో శ్రీధర్‌పై ఆర్టీఐ ప్రతినిధి గంగళ్ల రవి బుధవారం ఎస్సై సాయికుమార్‌కు ఫిర్యాదు చేశారు. సమాచార హక్కు చట్టం కింద దరఖాస్తు చేసుకున్న వారికి 30 రోజుల్లో సమాచారం ఇవ్వాల్సి ఉన్నప్పటికీ.. తాము సమాచారం ఇవ్వలేమని లిఖిత పూర్వకంగా రాసిచ్చిన ఈవోపై క్రిమినల్‌ కేసు నమోదు చేయాలని ఫిర్యాదులో కోరారు. ఆయనవెంట నాయకుడు కర్రోల రాజు ఉన్నారు.

నేడు జాబితా విడుదల

నిజామాబాద్‌అర్బన్‌: కేజీబీవీల్లో ఖాళీగా ఉన్న అకౌంటెంట్‌, ఏఎన్‌ఎం పోస్టుల భర్తీకి ఇటీవల జిల్లా విద్యాశాఖ దరఖాస్తులను స్వీకరించింది. పరిశీలన అనంతరం అభ్యర్థుల వివరాలను జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో గురువారం విడుదల చేస్తామని డీఈవో అశోక్‌ ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు రెండు రోజులపాటు జాబితాలో తమ వివరాలను సరిచేసుకొని ఏదైనా తప్పులు ఉంటే సంబంధిత అధికారులను సంప్రదించాలని సూచించారు.

ఏజెన్సీ నిర్వాహకులకు షోకాజ్‌ నోటీసు

బీబీపేట: మండల కేంద్రంలోని టీఎస్‌ఎస్‌ఆర్‌ బాలుర ఉన్నత పాఠశాల మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకులకు బుధవారం షోకాజ్‌ నోటీసు జారీ అయ్యింది. గత కొద్ది రోజులుగా మధ్యాహ్న భోజన సిబ్బంది వంట సరిగ్గా చేయడం లేదని విద్యార్థులు ఆరోపిస్తున్న నేపథ్యంలో తహసీల్దార్‌ సత్యనారాయణ, ఎంఈవో అశోక్‌, ఎంపీడీవో పూర్ణచంద్రోదయకుమార్‌ విద్యార్థులతో మాట్లాడి వారి అభిప్రాయాలను తెలుసుకుని నోటీసు జారీ చేశారు. రెండు రోజుల్లో ఏజెన్సీ నిర్వాహకులు సంజాయిషీ ఇవ్వాలని సూచించారు.

కొనుగోలు కేంద్రాలకు కమీషన్‌ కష్టాలు

- 2022 - 23 సంవత్సరానికి సంబంధించి రూ.35 కోట్ల బకాయిలు
- తేలని మరో రెండు సీజన్‌ల లెక్కలు
- కమీషన్‌ అందక ఇబ్బందులు



మోర్తాడ్‌లో ఐకేపీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న ధాన్యం కొనుగోళ్లు

మోర్తాడ్‌(బాల్కొండ): ధాన్యం కొనుగోలు కేంద్రాలను కమీషన్‌ కష్టాలు వెంటాడుతున్నాయి. కొనుగోలు చేసిన ధాన్యానికి కమీషన్‌ చెల్లించడంలో జాప్యం కారణంగా కేంద్రాల నిర్వాహకులు ఇబ్బందులు పడుతున్నారు. 2022–23 ఆర్థిక సంవత్సరలోని రెండు సీజన్‌ల కమీషన్‌ రూ.35,03,76,708 జిల్లాలోని కొనుగోలు కేంద్రాలకు జమ కావాల్సి ఉంది. 2023–24 ఆర్థిక సంవత్సరంలో రెండు సీజన్‌ల ధాన్యం సేకరించినప్పటికీ గన్నీ సంచుల స్వాధీనం, లెక్కలు చేయకపోవడంతో కమీషన్‌ ఎంతో ఇంకా తేలలేదు. గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే గడిచిన రెండు సీజన్‌లలోనూ రూ.35 కోట్లకు పైగానే కమీషన్‌ జమ కావాల్సి ఉంటుందని తెలుస్తోంది. వర్షాకాలం, యాసంగి సీజన్‌లలో ధాన్యం కొనుగోళ్లు జోరుగానే సాగుతున్నాయి. జిల్లాలోని అన్ని సహకార సంఘాలతోపాటు, మహిళా సమాఖ్యల ఆధ్వర్యంలోనూ ధాన్యం కొనుగోళ్లు సాగుతున్నాయి. దొడ్డు రకాలను గతంలో ఎక్కువగా కొనుగోలు చేయగా, కొన్ని సందర్భాల్లో సన్న రకాలను కూడా కొనుగోలు చేశారు. ఈ సీజన్‌లో మాత్రం సన్న రకాలకు రాష్ట్ర ప్రభుత్వం బోనస్‌ను ప్రకటించడంతో సన్న రకాల కొనుగోళ్లలో వేగం పుంజుకుంది. ఒక్కో క్వింటాలుకు రూ.32 వరకు కమీషన్‌ చెల్లిస్తున్నారు. ఈ లెక్కన ధాన్యం సేకరణను బట్టి కొనుగోలు కేంద్రాలను నిర్వహించిన సహకార సంఘాలు, మహిళా సమాఖ్యలకు భారీ మొత్తంలోనే కమీషన్‌ రూపంలో ఆదాయం సమకూరుతుంది. ఇది ఇలా ఉండగా సహకార సంఘాలకు కొనుగోళ్ల కమీషనే ప్రధాన ఆదాయ వనరుగా మారింది. ఎరువుల వ్యాపారం అంతంత మాత్రంగానే సాగుతుండటంతో ధాన్యం సేకరణ ద్వారా లభించే కమీషన్‌ సంఘాల నిర్వహణకు ప్రధానమైంది. ఈ నేపథ్యంలో కమీషన్‌ చెల్లించకపోవడంతో అనేక సహకార సంఘాలు ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నాయి. గత ప్రభుత్వం పౌర సరఫరాల సంస్థకు కొనుగోళ్ల కమీషన్‌కు సంబంధించిన నిధులను విడుదల చేయకపోవడంతో సహకార సంఘాల్లో కాసుల కొరత తీవ్రమైంది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ధాన్యం సేకరణ కమీషన్‌ సొమ్ము జమ చేయాలని పలువురు సూచిస్తున్నారు.

నిధులు విడుదల కావాల్సి ఉంది

కొనుగోలు కేంద్రాలకు కమీషన్‌కు సంబంధించి నిధులు విడుదల కావాల్సి ఉంది. ప్రభుత్వం నుంచి నిధులు రాగానే కొనుగోలు కేంద్రాలకు వారివారి కమీషన్‌ డబ్బులు చెల్లిస్తాం. కొనుగోళ్లు పూర్తి చేసిన వెంటనే గన్నీ సంచులు అప్పగించి లెక్కల వివరాలను అందించాలి. అన్ని కొనుగోలు కేంద్రాల లెక్కలు అందితేనే కమీషన్‌ సొమ్ము ఎంత అనేది ప్రభుత్వానికి నివేదించడానికి వీలవుతుంది.

– అంబదాస్‌ రాజేశ్వర్‌, పౌర సరఫరాల సంస్థ మేనేజర్‌

బాలల హక్కుల పరిరక్షణకు పాటుపడాలి

- పిల్లల సంరక్షణకు చట్ట పరమైన రక్షణ అవసరం
- జిల్లా జడ్జి సునీత కుంచాల



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా జడ్జి సునీత కుంచాల

నిజామాబాద్‌నాగారం: బాలల హక్కుల పరిరక్షణ కు అందరూ కలిసికట్టుగా పాటుపడాలని జిల్లా జడ్జి సునీత కుంచాల అన్నారు. మహిళ, శిశు సంక్షేమ శాఖ బాలల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో జిల్లా కోర్టు ప్రాంగణంలోని జిల్లా న్యాయ సేవ సాధికారత సంస్థ సమావేశ మందిరంలో బాలల హక్కుల వారోత్సవాలు ముగింపు కార్యక్రమాన్ని బుధవా రం నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ.. పిల్లలకు హక్కులపై అవగాహన కల్పించాలని, బాల్యం అంటే వారి శారీరక, మానసిక అపరిపక్వత సమయంలో పిల్లల సంరక్షణ కోసం చట్టపరమైన రక్షణ చాలా అవసరమన్నారు.

బాలల హక్కుల్లో భాగంగా జీవించే హక్కు, గుర్తింపు, అభివృద్ధి, విద్య, వినోదం అన్ని రంగాల్లో వారికి తోడ్పాటునందించాలని కోరారు. పిల్లల అక్రమరవాణా, హింస, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన బాధ్యత మనందరిపై ఉందన్నారు. అనంతరం మహిళా కమిషన్‌ సభ్యురాలు సూదం లక్ష్మి మాట్లాడుతూ.. అమ్మాయిలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని, ప్రభుత్వం తరపున అందించే ఫలాలను సద్వినియోగం చేసుకోవాలని, లైంగిక వేధింపులకు గురికాకుండా చూడాలని కోరారు. జిల్లా సంక్షేమ అధికారిణి షేక్‌ రసూల్‌ బీ మాట్లాడుతూ జిల్లాల్లో ఆరు చైల్డ్‌ కేర్‌ ఇన్‌స్టిట్యూషన్స్‌ ఉన్నాయని తెలిపారు. అనంతరం మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేశారు. ఆటలపోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. మానవతాసదన్‌, బాలసదనం పిల్లల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో జిల్లా న్యాయ సాధికారిక సంస్థ కార్యదర్శి పద్మావతి, డీసీపీ బస్వారెడ్డి, డీసీపీవో చైతన్యకుమార్‌, చైల్డ్‌ వెల్ఫేర్‌ కమిటీ సభ్యులు రాజేందర్‌, స్నేహ సొసైటీ సిద్ధయ్య, సాధన ఎన్జీవో కో ఆర్డినేటర్‌ మధు, డీసీపీయూ చైల్డ్‌ లైన్‌ సిబ్బంది, గుమ్మడి ఫౌండేషన్‌ సదానందరెడ్డి, ఆశ్రమ సిబ్బంది పాల్గొన్నారు.

సుదర్శన్‌రెడ్డి సైకిల్‌ సవారీ



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్‌: బోధన్‌ ఎమ్మెల్యే, మాజీ మంత్రి పొద్దుటూరి సుదర్శన్‌రెడ్డి సైకిల్‌ తొక్కుతున్న ఫొటోలు, వీడియో సోషల్‌ మీడియాలో వైరల్‌ అవుతున్నాయి. ప్రస్తుత శాసనసభలో అత్యంత సీనియర్‌గా ఉన్న సుదర్శన్‌రెడ్డి సరదాగా సైకిల్‌ తొక్కిన ఫొటోలు చూసి కాంగ్రెస్‌ నాయకులు, కార్యకర్తలు, నెటిజన్లు ఇదీ ఫిట్‌నెస్‌ మంత్రమంటూ కొనియాడుతున్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి





దండు శేఖర్‌ను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యేలు జీవన్‌రెడ్డి, బాజిరెడ్డి గోవర్ధన్‌

నిజామాబాద్‌అర్బన్‌: నగరంలోని ఓ ప్రైవేట్‌ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నగర మేయర్‌ నీతూకిరణ్‌ భర్త దండు శేఖర్‌ను బీఆర్‌ఎస్‌ జిల్లా అధ్యక్షుడు, ఆర్మూర్‌ మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి, రూరల్‌ మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్‌ బుధవారం వేర్వేరుగా పరామర్శించారు. దాడికి సంబంధించిన వివరాలు అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని ఆస్పత్రి వైద్యులను సూచించారు. దాడి ఘటన బాధాకరమని, దీని వెనుక ఎవరున్నా కఠినంగా శిక్షించాలని డిమాండ్‌ చేశారు.

క్రైం కార్నర్‌

అనుమానాస్పద స్థితిలో వృద్ధురాలు మృతి

బాన్సువాడ : బీర్కూర్‌ మండలం బరంగెడ్గి గ్రామ శివారులో గైని మాదవ్వ(60) అనే వృద్ధురాలు అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. కోటగిరి మండలం నాగేంద్రాపూర్‌ దేవునిగుట్ట తండాకు చెందిన మాదవ్వ మృతదేహం బరంగెడ్గి గ్రామ శివారులోని మత్తడి కాలువలో అనుమానాస్పద స్థితిలో కనిపించడంతో గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మురికికాలువలో పడి ఒకరు..



ఖలీల్‌ వాడి: నగరంలోని ఐదో టౌన్‌ పోలీస్‌ స్టేషన్‌ పరిధిలోని మురికి కాలువల పడి ఓ వ్యక్తి మృతి చెందినట్లు ఎస్సై గంగాధర్‌ బుధవారం తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.. నగరంలోని సీతారాంనగర్‌ కాలనీకి చెందిన కామ్రే కపిల్‌ (38) కూలీ పనులు చేస్తూ జీవించేవాడు. మంగళవారం రాత్రి వర్ని చౌరస్తా లోని కల్లుబట్టీ వద్ద మద్యం సేవించిన తర్వాత పక్కనే ఉన్న మురికి కాలువలో మూత్ర విసర్జనకు వెళ్లి అందులోపడి మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గుర్తుతెలియని వ్యక్తి ..



ఖలీల్‌వాడి: నిజామాబాద్‌ రైల్వే స్టేషన్‌ పరిధిలోని జేబీ స్పోర్ట్‌ షాప్‌ ఎదుట గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు ఎస్‌హెచ్‌వో రఘుపతి తెలిపారు. మృతుడి వయస్సు 45 నుంచి 50 ఏళ్లు ఉంటాయని, బ్లూ కలర్‌ టీ షర్టు చాక్లెట్‌ కలర్‌ నైట్‌ ప్యాంట్‌ ఉన్నట్లు తెలిపారు. మృతుడిని మేస్త్రి పని చేసే వ్యక్తిగా అనుమానిస్తున్నట్లు తెలిపారు. మృతుడి వివరాలు తెలిసిన వారు ఒకటో టౌన్‌ పోలీస్‌స్టేషన్‌లో లేదా 87126 59714 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

కంచర్లలో మహిళ దారుణహత్య

- మెడలో నుంచి బంగారు పుస్తెలతాడు అపహరణ

భిక్కనూరు: కామారెడ్డి జిల్లా భిక్కనూరు మండలం కంచర్ల గ్రామంలో దుండగులు ఓ మహిళను హతమార్చి ఆమె మెడలోని బంగారు పుస్తెల తాడును ఎత్తుకెళ్లారు. బుధవారం చోటుచేసుకున్న ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.. కంచర్ల గ్రామనికి చెందిన బాలెముల (చీకోటి) సుగుణ(55) తన భర్త సిద్ధరాములుతో కలిసి వ్యవసాయ క్షేత్రం వద్దకు వెళ్లింది. కంచర్ల – ఇస్సానగర్‌ వెళ్లే దారిలో రోడ్డు పక్కనే ఉన్న వీరి భూమిలోని వరి కొయ్యలను సుగుణ ఏరి వేస్తుండగా, ఆమె భర్త సిద్ధరాములు కొద్ది దూరంలో వ్యవసాయ పనులు చేస్తున్నాడు. దుండగులు సుగుణపై దాడి చేయడంతో అక్కడికక్కడే మృతి చెందింది. వెంటనే ఆమె మెడలోని మూడున్నర తులాల బంగారు పుస్తెలతాడును ఎత్తుకెళ్లారు. సమాచారం అందుకున్న కామారెడ్డి డీఎస్పీ నాగేశ్వర్‌రావు, భిక్కనూరు సీఐ సంపత్‌ కుమార్‌, ఎస్సై సాయికుమార్‌ ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. మృతురాలికి భర్తతోపాటు కుమారుడు రాజు, కుమార్తెలు శారద, శ్యామలు ఉన్నారు.

రెండు గ్రామాల్లో ధాన్యం బస్తాలు చోరీ

మోపాల్‌: మండలంలోని బాడ్సిలో రైతు లింబాద్రి సుభాష్‌కు చెందిన 8 క్వింటాళ్ల ధాన్యం బస్తాలు చోరీకి గురయ్యాయి. బోర్గాం(పి) గ్రామానికి చెందిన సదరు రైతు బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై యాదగిరి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. సుభాష్‌కు బాడ్సి శివారులో వ్యవసాయ భూమి ఉండగా, ధాన్యాన్ని రెండురోజుల క్రితం తూకం వేసి ఉంచాడు. అందులో నుంచి సుమారు 20 బస్తాల ధాన్యాన్ని మంగళవారం రాత్రి దుండగులు ఎత్తుకెళ్లారు. బుధవారం వెళ్లి చూడగా, ధాన్యం బస్తాలు తక్కువగా కన్పించడంతో సుభాష్‌ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

తాడెంలో..

మండలంలోని తాడెం గ్రామ రైతు వేల్పూర్‌ సాయిలుకు చెందిన 20 ధాన్యం బస్తాలను దుండగులు ఎత్తుకెళ్లారు. 36 బస్తాల ధాన్యం తూకం వేసి టార్పాలిన్‌ కప్పి ఉంచానని, బుధవారం వచ్చి చూడగా 20 బస్తాలు లేవని బాధితుడు వాపోయాడు. తమకు ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

ధాన్యం బస్తా అమ్ముకున్న లారీ డ్రైవర్‌



వడ్ల బస్తాతో పట్టుబడిన లారీ డ్రైవర్‌

లింగంపేట(ఎల్లారెడ్డి): పీఏసీఎస్‌ ధాన్యం కొనుగోలు కేంద్రం నుంచి రైస్‌ మిల్లుకు తరలిస్తున్న లోడ్‌లో నుంచి ధాన్యం బస్తాను మార్గమధ్యంలో లారీ డ్రైవర్‌ ఓ వ్యాపారికి విక్రయిస్తుండగా స్థానికులు పట్టుకొని లింగంపేట విండో సీఈవోకు అప్పగించారు. ఈ ఘటన లింగంపేటలో బుధవారం చోటు చేసుకుంది. భవానీపేట కొనుగోలు కేంద్రం నుంచి ధాన్యం బస్తాలను గాంధారి మండలంలోని వాసవి రైస్‌ మిల్లుకు తరలిస్తున్న లారీ డ్రైవర్‌ మోహన్‌.. లింగంపేటకు చేరుకోగానే మండల కేంద్రంలోని వడ్ల వ్యాపారి తాటిపాముల విజయ్‌కుమార్‌కు ఒక బస్తా విక్రయిస్తుండగా స్థానికులు పట్టుకున్నారు. మొదట ఫిర్యాదు చేయగా సీఈవో సైతం పట్టించుకోలేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లా అధికారులు స్పందించి ఈ ఘటనపై విచారణ చేపట్టాలని డిమాండ్‌ చేశారు.

రాష్ట్రంలోనే రెండో అతిపెద్ద పిరమిడ్‌





పిరమిడ్‌లో ధ్యానం చేస్తున్న భక్తులు

రాష్ట్రంలోనే రెండో అతిపెద్ద పిరమిడ్‌ను ఆర్మూర్‌లోని సిద్దుల గుట్టపై నిర్మిస్తున్నారు. నవనాథ సిద్ధేశ్వర పిరమిడ్‌ ధ్యాన మహా శక్తి క్షేత్రం ట్రస్టు, పిరమిడ్‌ స్పిరిచువల్‌ సొసైటీస్‌ మూమెంట్‌ ఫౌండర్‌ డాక్టర్‌ సుభాష్‌ ఆదేశాల మేరకు ఈ నిర్మాణం చేపడుతున్నట్లు పీఎస్‌ఎస్‌ఎం జిల్లా అధ్యక్షుడు సాయికృష్ణారెడ్డి తెలిపారు. ఇప్పటి వరకు రూ.70లక్షలు ఖర్చయ్యాయని, మొత్తం రూ.కోటి ఖర్చవుతుందన్నారు. మరో నెల రోజుల్లో నిర్మాణం పూర్తవుతుందని, ఒకేసారి 700 నుంచి వెయ్యి మంది ధ్యానం చేయొచ్చని తెలిపారు.

– సాక్షి స్టాఫ్‌ ఫొటోగ్రాఫర్‌, నిజామాబాద్‌

తెలంగాణను ఆంధ్రలో కలిపేందుకు కుట్ర

- కేసీఆర్‌, కేటీఆర్‌ను ఎవరేమీ చేయలేరు
- బీఆర్‌ఎస్‌ జిల్లా అధ్యక్షుడు జీవన్‌రెడ్డి



మాట్లాడుతున్న జీవన్‌రెడ్డి

నిజామాబాద్‌అర్బన్‌: తెలంగాణను ఆంధ్రలో కలిపేందుకు సీఎం రేవంత్‌రెడ్డి కుట్ర చేస్తున్నారని బీఆర్‌ఎస్‌ జిల్లా అధ్యక్షుడు, ఆర్మూర్‌ మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి ఆరోపించారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సీఎం రేవంత్‌ తరచూ మాజీ సీఎం కేసీఆర్‌ని లేకుండా చేస్తానని అంటున్నారని, తెలంగాణను ఆంధ్రలో కలిపి తాను అనుకున్నది సాధించాలనుకుంటున్నారని విమర్శించారు. కేసీఆర్‌, కేటీఆర్‌ను ఎవరేమీ చేయలేరని, వారిని అరెస్టు చేస్తే రాష్ట్రం అగ్నిగుండమవుతుందన్నారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలు చేయడం చేతకాకపోయినప్పటికీ విమర్శలు చేయడం సిగ్గుచేటన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలోని గురుకులాల్లో విద్యార్థులకు పురుగుల అన్నం ఇస్తున్నారని, స్కాలర్‌షిప్‌ల కోసం విద్యార్థులు, వేతనాల కోసం ఉద్యోగులు రోడ్డెక్కుతున్నారన్నారు. మూసీ నదికి ఇచ్చే నిధులతో రాష్ట్రంలో పెన్షన్స్‌, రుణమాఫీ చేయొచ్చని పేర్కొన్నారు. నగర మేయర్‌ నీతూ కిరణ్‌ భర్త దండు శేఖర్‌పై దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్‌ చేశారు. పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడు, సీఎం రేవంత్‌రెడ్డి ఈ కుట్ర వెనుక ఉన్నారని, విచారణ చేయించాలని డిమాండ్‌ చేశారు. నిందితుడు కాంగ్రెస్‌ పార్టీకి చెందిన వ్యక్తి అని, పక్కా ప్రణాళిక ప్రకారమే శేఖర్‌పై హత్యాయత్నం జరిగిందన్నారు. సమావేశంలో జెడ్పీ మాజీ చైర్మన్‌ దాదన్నగారి విఠల్‌రావు, బీఆర్‌ఎస్‌ నాయకులు సుజిత్‌, నుడా మాజీ చైర్మన్‌ ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణను విస్మరిస్తే పతనం ఖాయం



మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు గోవింద్‌ మాదిగ

నిజామాబాద్‌అర్బన్‌: ఎస్సీ వర్గీకరణను విస్మరిస్తే సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వ పతనం ఖాయమని ఎమ్మార్పీఎస్‌ రాష్ట్ర అధ్యక్షుడు గోవింద్‌ నరేశ్‌ మాదిగ అన్నారు. జిల్లా కేంద్రంలోని మర్చంట్‌ అసోసియేషన్‌ భవన్‌లో బుధవారం ఉమ్మడి జిల్లా ఎమ్మార్పీఎస్‌ అనుబంధ సంఘాల సమీక్షాసమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 1965 నాటి రిజర్వేషన్లు ఎస్సీల్లోని అన్ని కులాలకు అందడం లేదని, ఎస్సీ వర్గాల వర్గీకరణ చేయాలని లోకూర్‌ కమిటీ కాంగ్రెస్‌ ప్రభుత్వానికి నివేదిక సమర్పించిందన్నారు. ఆ ప్రతిపాదనను చెత్తబుట్టలో పడేసి సామాజిక న్యాయాన్ని అవమానించిన చరిత్ర కాంగ్రెస్‌ పార్టీకి ఉందన్నారు. ఎస్సీ వర్గీకరణ కోరుతూ మాదిగలు పదేళ్లపాటు ఉద్యమిస్తే కాంగ్రెస్‌ కనీసం పట్టించుకోలేదని విమర్శించారు. కాంగ్రెస్‌ డీఎన్‌ఏలోనే సామాజిక న్యాయ వ్యతిరేకత ఉందన్నారు. ఎస్సీ వర్గీకరణ అమలు చేయడంలో దేశంలో ముందు ఉంటామని ముఖ్యమంత్రి రేవంత్‌ రెడ్డి అసెంబ్లీలో ప్రకటిస్తే కాంగ్రెస్‌ అధిష్టానం ఆగ్రహం వ్యక్తం చేసి ఎస్సీ వర్గీకరణ మీద ముందుకు వెళ్లకుండా సీఎంను నియంత్రించిందని ఆరోపించారు. వర్గీకరణ కోసం మాదిగలు మరో పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఉద్యమాన్ని బలోపేతం చేసేందుకు మండల, గ్రామాల కమిటీలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. సమావేశంలో మహాజన సోషలిస్టు పార్టీ జిల్లా అధ్యక్షుడు సరికెల పోశెట్టి, జాతీయ నాయకులు గంగాధర్‌, యమున, సత్య, లక్ష్మి, సంజీవ్‌, ఆకారం రమేశ్‌, పద్మ, సావిత్రి, సుధా, మహేశ్‌, వెంకట్‌, రాములు, రమేశ్‌, నాగరాజు, లావణ్య, సూర్య, అశోక్‌ తదితరులు పాల్గొన్నారు.

అండర్‌–19 హాకీ జట్టు ఎంపిక



రాష్ట్రస్థాయికి ఎంపికైన హాకీ క్రీడాకారులు

ఆర్మూర్‌: జిల్లా ఇంటర్మీడియెట్‌ ఎడ్యుకేషనల్‌ ఆఫీసర్‌ రవికుమార్‌ ఆదేశాల మేరకు పట్టణంలోని మినీ స్టేడియంలో నిజామాబాద్‌, కామారెడ్డి జిల్లాల ఎస్‌జీఎఫ్‌ అండర్‌ – 19 బాలుర, బాలికల హాకీ రాష్ట్రస్థాయి జట్ల ఎంపిక పోటీలను బుధవారం నిర్వహించారు. 35 మంది బాలికలు, 40 మంది బాలురు పాల్గొనగా, ప్రతిభ ఆధారంగా 18 మందితో కూడిన తుది జట్టును ఎంపిక చేశామని జిల్లా హాకీ అసోసియేషన్‌ ప్రధాన కార్యదర్శి సదమస్తుల రమణ తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు త్వరలో నల్గొండలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి టోర్నీలో పాల్గొంటారన్నారు. ఫిజికల్‌ డైరెక్టర్లు సడక్‌ గణేశ్‌, దండుగుల చిన్నయ్య, జిల్లా హాకీ అసోసియేషన్‌ ట్రెజరర్‌ పింజ సురేందర్‌, కత్తి శీను, గంగాధర్‌, సంతోష్‌ రెడ్డి, మీనా పాల్గొన్నారు.



ఎస్‌జీఎఫ్‌ జాతీయస్థాయికి..

నిజామాబాద్‌నాగారం: ఎస్‌జీఎఫ్‌ జాతీయస్థాయి హాకీ టోర్నీకి జిల్లాకు చెందిన క్రీడాకారిణులు ఎంపికయ్యారు. ఈ నెల 22 నుంచి 25వ తేదీ వరకు హర్యానా రాష్ట్రంలో రోథక్‌లో నిర్వహించే జాతీయస్థాయి అండర్‌–17 హాకీ చాంపియన్‌షిప్‌ పోటీల్లో పాల్గొనున్నారు. బుధవారం జిల్లా నుంచి ఆరుగురు క్రీడాకారిణులు బయల్దేరి వెళ్లారు. జట్టుకు కోచ్‌గా రాజేశ్వర్‌, టీం మేనేజర్‌గా ఇందిర వ్యవహరిస్తున్నారు.

గుండెపోటుతో విద్యార్థిని మృతి

- మూడునెలల వ్యవధిలో అనారోగ్యంతో తండ్రీకూతురు..



శిరీష(ఫైల్‌)

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని గోపాల్‌పేటకు చెందిన ఎరుకల శిరీష మంగళవారం గుండెపోటుతో మృతి చెందింది. ప్రభుత్వ జూనియర్‌ కళాశాలలో ఇంటర్‌ చదువుతున్న శిరీష ఐదు రోజుల క్రితం అనారోగ్యం బారినపడడంతో కుటుంబ సభ్యులు ప్రైవేట్‌ ఆస్పత్రికి తీసుకెళ్లారు. మంగళవారం రాత్రి గుండెపోటురావడంతో ఆమె మృతి చెందింది. శిరీష తండ్రి నారాయణ సెప్టెంబర్‌లో అనారోగ్యంతో మృతి చెందాడు. మూడు నెలల వ్యవధిలోనే తండ్రీకూతురు అనారోగ్యంబారినపడి మృతిచెందడం ఆ కుటుంబంలో తీరని విషాదాన్ని నింపింది. కాగా తమ ఇంటి చుట్టూ మురికినీరు పేరుకుపోవడంతోపాటు పిచ్చి మొక్కలు దట్టంగా పెరిగి దోమలబెడద ఎక్కువగా ఉందని, అందువల్లే తమ కుటుంబంలోని ఇద్దరు అనారోగ్యానికి గురై మరణించారని నారాయణ భార్య మంజుల, పెద్ద కూతురు కవిత ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి తమ ఇంటి చుట్టూ పేరుకుపోయిన మురికినీటిని తొలగింపజేయడంతోపాటు పరిసరాలను శుభ్రం చేయించాలని వారు వేడుకుంటున్నారు.